

# రెండు ఎర్రటి చేతులు

పురాణపండ రాధాకృష్ణమూర్తి

అతని పేరు 'హరిచరణుడు'. అయినా అందరూ అతణ్ణి ''దుర్గాదాసు'' అని పిలుస్తూంటారు. అవశ్యం అందుకేదో కారణం వుండాలి కదా. గురుదేవుల సన్నిధానంలో అతడు ఉపదేశం పొందే సమయంలో ఆ మహాత్ముడు ''నాయనా సర్వకాల సర్వావస్థల్లోనూ ''దుర్గా దుర్గా'' అని జపించాలి అన్నాడు.

శ్లో॥ దుర్గా దుర్గేతి దుర్గేతి దుర్గానామ పరం మనుః
యో జపేత్ సతతం చండి జీవన్ముక్తః స మానవః

''అమ్మా! చండీ! దుర్గా! దుర్గా! దుర్గా'' అన్న నామమే పరమమంత్రము. ఈ నామాన్ని నిరంతరం జపించే మానవుడు జీవన్ముక్తుడవుతాడు'' అని గురుదేవుడు పలికిన వచనాలు విన్న క్షణం నుంచీ హరిచరణుడు ''దుర్గా దుర్గా అమ్మా దుర్గా!'' అని అనడం ఆరంభించాడు. ఉదయాన ''దుర్గా దుర్గా'' అంటూ లేస్తాడు. నిర్విరామంగా ''దుర్గా! దుర్గా'' అంటూ స్నానం చేస్తాడు. పూజాంతంలో దుర్గానామాన్ని జపిస్తూ గాజుల మూటను భుజాన వేసుకుని బయటకు వెడతాడు.

హరిచరణుడు గాజుల వ్యాపారి. అది వినా వాని జీవనానికి మరో ఆధారం లేదు. అహోరాత్ర భేదం లేకుండా విసుగూ విరామం లేకుండా అతడు ''దుర్గా దుర్గా'' అని అంటూండడంవల్ల ప్రజలు అతణ్ణి యెదురుగా ''దుర్గాదాసు'' అనీ, వెనకాల దుర్గా పిచ్చివాడనీ పిలవసాగారు. ఎవరి మాటలూ, హేళనలూ లెక్కచేయకుండా అతడు తన్మయత్వంతో దుర్గా నామాన్ని స్మరించుకుంటూ పోతున్నాడు. పగలల్లా అతడు భగవతి నామాన్ని జపిస్తూ గాజులు అమ్ముకుంటుంటాడు. రాత్రి ఆ జనని నామాన్నే స్మరించుకుంటూ నిద్రపోతాడు. నిద్రలో కూడా అతని జిహ్వ దుర్గా నామాన్నే జపిస్తూంటుంది.

కామినీ కాంచనాలకు దాసులై విషయ వాసనాలోలురైన ఇరుగు పొరుగు వారందరూ అతనికి పిచ్చెక్కిందనుకున్నారు. లేకపోతే రాత్రనక పగలనక అతడు దుర్గా నామాన్నెందుకు జపిస్తాడన్నారు. సుఖంలో, దుఃఖంలో, రోగంలో, శోకంలో అన్ని వేళల్లోనూ అతడు తన్మయత్వంతో అమ్మ నామం స్మరించుకుంటూ పోతున్నాడు. పిచ్చివాడుకాక మరేమవుతాడు అన్నారు మరికొందరు. వయసులో వున్నవారు 'దుర్గా దాసుడు' అంటూ హేళనచేసేవారు. అల్లరి పిల్లల మూక ''ఓ పిచ్చివాడు 'దుర్గా' అనుకుంటూ గాజులమ్ముతాడు. దుర్గ వాని వెనకాలే తిరుగుతూంటుంది'' అంటూ గేలి చెయ్యసాగారు.

ఆ మాటలు విన్నప్పుడల్లా హరిచరణుని శరీరం రోమాంచితమవుతూంటుంది. అతడు దుర్గ వస్తూన్నదో లేదో అని వెనక్కి తిరిగి చూస్తూంటాడు కూడా. దానితో అల్లరి పిల్లలంతా చప్పట్లు కొడుతూ కేరింతాలాడుతూ అతనిపై దుమ్ము చల్లుతూ నవ్వుతూ పోతూంటారు. అంత జరుగుతున్నా సహిస్తూ అతడు అమ్మ నామాన్ని ఆనందంగా స్మరించుకుంటూ ముందుకు సాగిపోతూంటాడు. విరామం లేకుండా అమ్మ నామాన్ని స్మరించుకుంటూండడంవల్ల తల్లిదండ్రులతనికి పెట్టిన హరిచరణుడన్న పేరు పోయి దుర్గాదాస నామం సార్థకమైపోయింది. అందుకు కూడా అతడేమీ బాధపడలేదు.

*          *          *

అది వైశాఖ మాసం. రెండు జాముల వేళ. ఎండ మండిపోతోంది. గాజుల మూట బుజాన వేసుకుని దుర్గాదాసు ''దుర్గా! దుర్గా!'' అనుకొంటూ తారిజీపుర సీమ దాటి మైదానం చేరాడు.

కొంత ముందుకు సాగేసరికి మైదానం మధ్య భాగంలో ఓ చిన్న చెరువు వచ్చింది. అతడు దానిని కూడా దాటి ముందుకు అడుగు వేయబోతూండగా ''ఓ గాజులబ్బీ! ఆగు! నాకు గాజులు కావాలి'' అని ఎవరో పిలుస్తూన్నట్టు వినిపించింది. అలాంటి మధుర కంఠాన్ని అంత వరకూ అతడు వినలేదు. వెనుదిరిగి చూశాడు. చెరువులోని నీళ్ళల్లోంచి ఓ స్త్రీమూర్తి ముందుకు వస్తూ పిలుస్తూన్నది. ఆ దివ్యమంగళ సుందర తేజోమయమూర్తిని చూసి అతడు క్షణకాలం స్తంభించిపోయాడు. మరల మాయ ఆవహించింది. ప్రకృతిలో పడిపోయాడు. అనేకమంది జమీందార్ల, లక్షాధికార్ల ఇళ్ళలో ఆడవారి కెందరికో అతడు గాజులు

వేశాడు. కాని ఎన్నడూ అతడలాంటి స్త్రీమూర్తిని మూడలేదు. "రండమ్మా రండి. మీకు వచ్చిన గాజులు వేస్తాను" అంటూ అతడు ఓ పెద్ద చెట్టు నీడలో కూర్చున్నాడు.

ఆ స్త్రీమూర్తి నెమ్మదిగా అతని దగ్గరకు వచ్చి కూర్చుంది. ఆమె మహనీయ రూపాన్ని మాసి అతడు మనసా "దుర్గ నీ వెనకాలే తిరుగుతోంది" అని అల్లరి పిల్లలు అన్న మాటలు నిజమే కాబోలు అనుకున్నాడు. ఆమె మందహాసం చేస్తూ, "గాజులబ్బీ! నాకు మంచి గాజులెయ్యి" అంది.

దుర్గాదాసు మూటలోంచి మంచి గాజులు తీసి ఆమె చేతులకు వెయ్యసాగాడు. ఆమె స్పర్శమాత్రంచే **అతని శరీరమంతా రోమాంచితమై పోయింది. గుండె దడదడలాడసాగింది.**

గాజులు తొడుగుతూ కూడా అతడు "దుర్గా! దుర్గా" అని అంటూనే వున్నాడు. "అబ్బీ! ఇందాక మంచి మూస్తూన్నాను. 'దుర్గా! దుర్గా' అంటున్నావేమిటి? దీనివల్ల నీకు కలిగే లాభం ఏమిటి?" అని ఆమె ప్రశ్నించింది.

దుర్గాదాసుకు నోట మాట రావడంలేదు. కొన్ని క్షణాలు గడిచాయి. "అమ్మా! మా గురువుగారు "దుర్గా దుర్గా" అని సర్వదా అనమన్నారమ్మా! అందుకే అంటున్నాను. ఈ జపం వల్ల, స్మరణవల్ల అమ్మ తప్పక దయచూపుతుందని వారు చెప్పారు తల్లీ" అన్నాడు.

"నువ్వెప్పుడైనా అమ్మను చూశావా?"

"లేదు తల్లీ! అమ్మను చూసేటంతటి పుణ్యకార్యం నేనేమి చేయగలిగానమ్మా?"

" 'దుర్గా దుర్గా' అని జపించడం కంటె పుణ్య కార్యం ఏముందయ్యా? అయినా అమ్మను చూడలేని దానికి ఊరికే జపించడం మాత్రం దేనికి?"

"అమ్మా! నేను మూఢుడ్ని. సరిగా నాకేమీ తెలియదు. నామాన్ని జపించినంత మాత్రానికే దర్శన భాగ్యం కలిగేటట్టయితే అవశ్యం ఇంకా జపిస్తాను."

గాజులు తొడగడం అయిపోయింది. అప్పుడామె నవ్వుతూ, "అబ్బీ చెప్పడం మరచాను. అసలు నా దగ్గర డబ్బులు లేవురా! నీ గాజులు నువ్వు తీసేసుకో" అంది.

ఎందుకో తెలియదు- దుర్గాదాసు ఉదాసీనుడై పోయాడు. "అమ్మా! తియ్యకమ్మా తియ్యకు. స్త్రీ జాతి అంతా సాక్షాత్తూ భగవతి స్వరూపమే కదా? మీ చేతుల నుంచి నేను గాజులు తిరిగి తియ్యలేను. నాకు వీటి ధర ఇవ్వనక్కరలేదు" అంటూ అతడు మూటను సర్దుకోసాగాడు.

"అబ్బీ! నీకు డబ్బు లివ్వకుండా గాజులు వేయించుకోను. సరేలే! పోనీ ఓ పనిచెయ్యి. మా నాన్నగారి పేరు ఉమాపద భట్టాచార్యగారు, వారినడిగి డబ్బులు తీసుకో. మీ అమ్మాయిగారు గాజులు వేయించుకున్నారు, డబ్బులివ్వమన్నారని చెప్పు. వారు నాకసలు ఆడపిల్లలు లేరంటారు. కానీ నువ్వు వారి మాటలు నమ్మకు. ఇప్పుడే గాజులు వేసివస్తే అసలు అమ్మాయి లేదంటారేమిటను. అంతతో ఊరుకోకు. దుర్గామాత విగ్రహం కింద వున్న కుంకుమ బరిణెలో ఒకే ఒక అర్థరూపాయి వుంది, తీసి ఇమ్మన్నారని చెప్పు. వెళ్ళు" అంది.

"ఇప్పుడే వెడతానమ్మా!" అంటూ దుర్గాదాసు వెళ్ళిపోయాడు. ఆ స్త్రీమూర్తి మరల ఆ చెరువులోని నీళ్ళలోకి దిగిపోయింది.

*　　　*　　　*

ఉమాపద భట్టాచార్యులవారికి అప్పు ఇస్తే తిరిగి రాదని తెలిసి కూడా ప్రజలాయనకు అప్పులిస్తుంటారు. మొదటి నుంచీ ఆయన పరిస్థితి ఇలాంటిది కాదు. సిరిసంపదలతో తులతూగే ఆయన వక్రించిన కాల ప్రవాహంలో పడి ఆర్థికంగా దిగజారిపోయాడు. కాని ఆయన చిత్తవృత్తులు మాత్రం పూర్తిగా అమ్మవైపు సంలగ్నం కాసాగాయి. స్వగృహంలో ఆయన దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించుకున్నాడు. పూజలో, ఆత్మ చింతనలో, సద్గ్రంథావలోకనంలోనే ఆయన సమయం అధికంగా గడిచిపోయేది. ఆయన భార్య అన్నపూర్ణ. సహధర్మచారిణిగా పేరు తెచ్చుకున్నది. అయిదారేళ్ళ వయస్సుకల శివరామ కుమారుడు "దుర్గా! దుర్గా" అంటూ భజన చేస్తూ నాట్యమాడుతూంటే తల్లిదండ్రులు ఆనందాశ్రువులను తుడుచుకుంటూ ఆనందపరవశులవుతూండేవారు. క్రమక్రమంగా వారి భోగవాసనలు క్షీణించసాగాయి.

ఉమాపద భట్టాచార్యులవారు నిత్యం బ్రహ్మ ముహూర్తానికి ముందుగానే లేచి "దుర్గా దుర్గా" అనుకుంటూ స్నానం చేసి ప్రాతః సంధ్యాదులు పూర్తి చేసుకొని భగవద్గీత, చండీస్తోత్రాదులను పారాయణ చేసుకుంటారు. పూజ, హవనాదులయిన తరువాత అమ్మవారికి నైవేద్యం పెట్టి బలి వైశ్వదేవ గోగ్రాసాదు లర్పించి అతిథులెవరైనా వస్తారేమోనని నిరీక్షిస్తుంటారు. అతిథి సేవానంతరం భాగవత పురాణ, దేవీభాగవత,దేవీ పురాణ, దేవ్యుపనిషదాదులను యథాశక్తి పఠిస్తూనే అపరాహ్ణాన్ని గడిపేస్తారు.

సాయం సంధ్యానంతరం శ్రీదేవికి హారతులర్పించి దీప ప్రకాశంలో కూర్చుని చాలా సేపు జపం చేసుకుంటూ అమ్మ లీలలను గురించి చింతిస్తూంటారు. సాయంకాలం అతిథి సేవానంతరం కొంచెం ప్రసాదాన్ని స్వీకరించి అర్థరాత్రివేళ జగత్తు అంతా నిశ్శబ్దంగా వున్న వేళ ఆయన తన హృదయకమలంలో జనని ఆగమనానికై నిరీక్షిస్తుంటారు. ఈ విధంగా ఆయన కాలం గడుస్తూంటుంది.

*　　　*　　　*

అన్నపూర్ణ సాక్షాత్తూ అన్నపూర్ణయే. "దుర్గా! దుర్గా" అంటూ ఆమె గృహ కృత్యాలన్నీ చేసుకుంటూంటుంది. దేవ, పతి, అతిథి సేవలలో ఆమె సదా సంలగ్న అయి వుంటుంది. 'దుర్గా' నామ జపరహితంగా ఆమె జిహ్వ క్షణం కూడా వుండదు.

భట్టాచార్యులవారు ధనాన్ని సంపాదించాలన్న ప్రయత్నాన్ని యెన్నడూ చెయ్యలేదు. దానితో దారిద్ర్య స్థితి మనస్సులో యెన్నడైనా మెదిలితే ఆయన మనస్సులోనే గుసగుసలాడుతూ 'భవానీ చరణ కమలాలను స్మరించే నీకు సిరిసంపదలెలా లభిస్తాయి. ఆ పాద రాజీవాలు సంపదలను నాశనంచేసేవి కాకపోతే శివదేవుడు స్మశాన వాసి యెందుకవుతాడు?' అని తన్మయత్వం చెందే ఆయనకు దరిద్ర విషయం స్మృతిలో వుండేదే కాదు. ఉండుండి ఆయనకో సందేహం కలుగుతూండేది. 'ఇష్టదేవతా దర్శనం భావ రూపంలోనే అవుతుందా?' దాని కెన్నడూ ఆయనకు సమాధానం దొరకలేదు.

దరిద్రం కారణంగా అప్పులు బాగా పెరిగిపోవడంతో 'ఇక అప్పులు చెయ్యను, ఎవరినీ యాచించను కూడా. అమ్మ అన్నం పెడితే తింటాము. లేకుంటే పస్తుంటాము. అప్పులు చేసి యితరుల్ని యెందుకు బాధ పెట్టాలి. అమ్మ యేమి చేస్తుందో చూస్తాను. ప్రాణాలు పోయినా సరే. అమ్మను తప్ప యెవరినీ యాచించను' అని నిశ్చయించుకున్నారు భట్టాచార్యగారు.

సంధ్యా పూజాదికాలు నెరవేర్చుకుని ఆయన అన్నపూర్ణను "అమ్మవారికి నైవేద్యం తెమ్మ"న్నాడు. కాని నాడు నైవేద్యానికి యింట్లో యేమీ లేవు. రెండు జాములు గడిచిపోయాయి. ఆయన ధ్యానమగ్నుడై పోయాడు. శివరాముడు ఆకలితో గిలగిలలాడి పోతున్నాడు. "దుర్గా మాతా! దుర్గా మాతా!" అంటూ అన్నపూర్ణ అమ్మ నామాన్ని జపిస్తూంది.

అదే సమయంలో బయట నుండి యెవరో వచ్చి "శివరావ్! ఓసారి బయటకు రా బాబూ!" అన్నారు. కళ్ళు తుడుచుకుంటూ శివరాముడు బయటకు వెళ్ళాడు. కొన్ని క్షణాలలో మామిడి పళ్ళ బుట్టతో లోపలికి వచ్చాడు. బుట్టను తల్లికిచ్చి, అతడు "అమ్మా పేరు చెప్పలేదు. ఆయనెవరో ఈ బుట్ట నిచ్చి వెళ్లిపోయారమ్మా!" అన్నాడు. ఆ విషయం తెలిసికోవటానికి అన్నపూర్ణకు అట్టే సమయం పట్టలేదు. నీళ్ళు నిండిన కళ్ళతో ఆ బుట్టను ఆమె అమ్మగారి దగ్గర నైవేద్యం కోసం పెట్టింది. కొంతసేపటికి ఉమాపదుని ధ్యానం భగ్నమయింది. చూచేసరికి అమ్మ సమక్షంలో నైవేద్యం పెట్టబడి వుంది. "ఇదంతా ఎక్కడ నుండి వచ్చింది?" అని అతడు భార్య నడిగాడు. "ఎవరో శివరాముడి కిచ్చి వెళ్ళిపోయారు" అంది అన్నపూర్ణ. ఉమాపదుడు 'అమ్మ పురుష రూపంలో కూడ వస్తుందా?' అనుకున్నాడు. ఆయన కనులు చెమ్మగిల్లాయి.

ఆయన దుర్గాదేవికి మహదానందంగా నైవేద్యం

## ప్రశ్న?

పర్వతాంచలాల్లో
వృక్షా లెందుకు చిక్కుముడుల్లా
విస్తరిస్తాయి?

మేఘాల నీలిమ
ఎంచేత పర్వతసానువుల్ని
కప్పివేస్తుంటుంది?

ఎందుకంటే —
జీవన జల సన్నగా మొదలై
సుడి తిరిగే నదిగా
ఉధృతమౌతోంది కనక!

—ఎస్.ఎ.రవూఫ్

